

# నేటి నుంచి సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలు





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

బుధవారం | 20 | ఆగస్టు | 2025 పేజీలు : 8


## అపరిశుభ్రతకు నిలయంగా

# పెద్దాసుపత్రి..!



-దుర్వాసన వస్తున్న మాతా శిశు ఆరోగ్య కేంద్రం
-ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, బాలింతలు
-దురుసుగా ప్రవర్తిస్తున్న సిబ్బంది వైద్యసేవలు అంతంత మాత్రమే..
-పట్టించుకోని సంబంధిత అధికారులు

**ప్రజాపక్షం/ వైద్యవిభాగం :** పరిశుభ్రతలో ఆదర్శంగా నిలవాల్సిన ఆసుపత్రి పిహెచ్‌సిలకు, ఏరియా ఆసుపత్రులకు మార్గదర్శిగా పని చేయాల్సిన ఆసుపత్రి అపరిశుభ్రతకు నిలయంగా మారింది. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో గల మాతా శిశు కేంద్రం

మిగతా 2లో..

## వర్షాలకు దెబ్బతిన్న

# మెట్ట పంటలు

-చేతికందిన పెసర, ఇతర అపరాల పంటలకు భారీ నష్టం
-పత్తి దెబ్బతిన్నదన్న ఆవేదనలో రైతులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మెట్ట పంటలు భారీగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా పత్తి, అపరాలు ఇతర పునాస పంటలను వర్షాలు దెబ్బతీశాయి. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా చేతికందిన పెసర పంట పూర్తిగా దెబ్బ తిన్నది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేల ఎకరాల్లో పంటలను సాగు చేశారు. పూత కాత దశలో వర్షాలు రావడంతో పెసర దిగుబడి వచ్చే పరిస్థితి

మిగతా 2లో..

# మామూళ్ల మత్తు.. నాణ్యత గల్లంతు..!





-ప్రజాప్రతినిధుల ఆశయానికి అవినీతి అధికారుల తూట్లు
-ఏడాదికే రహదారి ఛిద్రం
-ఎవరు ఫిర్యాదు చేయలేదు : పిఆర్ఏఈ

**ప్రజాపక్షం/ చింతకాని :** మామూళ్ల మత్తులో నాణ్యత గల్లంతవుతుంది. కోట్లాది రూపాయల ప్రజా ధనం కొందరి జేబుల్లోకి చేరుతుంది. ఇటీవల కాలంలో గతంలో ఎన్నడు లేనివిధంగా ప్రజాప్రతినిధులతో మమేకమయ్యే గుత్తేదారులకే పనులు అప్పగించడంతో గుత్తేదారు చేసిందే పని ఇంజనీరింగ్ అధికారి చూసిందే నాణ్యత అన్న చందంగా తయారైంది. క్షేత్రస్థాయి అధికారులపై, గుత్తేదారుపై ఫిర్యాదు చేసినా వారు ప్రజాప్రతినిధులకు అత్యంత దగ్గరగా మసులుతుండడంతో ఉన్నతాధికారులు సైతం నాణ్యతపై ప్రశ్నించేందుకు సంశయిస్తున్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా ఉప ముఖ్యమంత్రిగా తనకు వచ్చిన అవకాశాన్ని మధిర నియోజక వర్గ అభివృద్ధికి వినియోగించాలన్న తపనతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అభివృద్ధి పనుల కోసం కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించి పనులు చేపడుతున్నారు. రహదారులపై విక్రమార్క ప్రత్యేక దృష్టిసారించారు. కానీ భట్టి ఆశయాలకు గుత్తేదారులు వారితో చేతులు కలిపిన అధికారులు

మిగతా 2లో..

# ఇసుకాసురుల ఇష్టారాజ్యం..!



- రహదారులు గోతులమయం
- ఇబ్బందిగా మారిన సరిహద్దు సమస్య
- పట్టించుకోని పాలకులు
- పన్నులు ప్రభుత్వానికి, లాభాలు కాంట్రాక్టర్లకు, ఇబ్బందులు ప్రజలకు..

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం ఏజెన్సీలో ఇసుకాసూరుల ఇష్టారాజ్యం సాగుతోంది. ఇసుక ర్యాంపులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నామనే సాకుతో లాభాలను జేబుల్లో వేసుకుంటూ ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. చర్ల మండల పరిధిలో 9 ఇసుక ర్యాంపులు నడుస్తున్నాయి. ఇక్కడ నాణ్యమైన అసుక లభ్యం అవుతుండటంతో పెద్ద ఎత్తున లారీలు హైదరాబాద్, ఖమ్మం వంటి ప్రాంతాలకు ఇసుక లోడ్‌లతో వెళుతుంటాయి. అయితే వాస్తవ లోడింగ్‌కు అంటే ఓవర్ లోడింగ్‌తో లారీలు తిరుగుతుండటంతో రోడ్లను ధ్వంసం అవుతున్నాయి. ఇసుక ర్యాంపుల నుండి మొదలుకుని భద్రాచలం వరకు ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో వాహనాల రాక పోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుండటంతో పాటు నిత్య ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎక్కడ చూసిన పెద్ద ఎత్తున గోతులు

మిగతా 2లో..

# అపరిశుభ్రతకు నిలయంగా పెద్దాసుపత్రి..!







(మొదటిపేజీ తరువాయి)

విభాగంలో పారిశుధ్యం నెలకొని కంపుకొడుతుంది. రోగులు ఉండే గదులు, మరుగుదొడ్లు శుభ్రం చేయకపోవడంతో వాటి నుండి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. రోగికి ఉన్న రోగం పోవడమేమో కానీ కొత్త జబ్బులు వస్తాయని ఆందోళన చెందుతున్నారు. రోగుల పక్కన వచ్చే సహాయకుల పరిస్థితి మరింత దారుణం. ముక్కుకు ఏదో ఒకటి అడ్డుపెట్టుకోక పోతే నిలబడే పరిస్థితి లేదు. మాతా శిశు కేంద్రానికి వైద్య సాయం కోసం వచ్చేది గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు మాత్రమే. వీరికి సరైన వాతావరణం లేకపోతే వెంటనే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఇది తెలిసినా వైద్య సిబ్బంది పట్టించుకోకపోవడం శోచనీయం. చిన్నారులకు వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ఉదయం వైద్యులు విజిట్ చేసి రక్త పరీక్షలు చేయించాలని సూచిస్తే ఆ రక్త నమూనాలు సేకరించేందుకే సాయంత్రం సమయం పడితే అందుకు సంబంధించిన రిపోర్టులు ఇచ్చేదెన్నడో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఈ రకంగా వైద్య సేవలు అందిస్తే చిన్నారుల ఆరోగ్యాలు కుదుటపడేదెన్నడోనని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అందుకు తోడు పరీక్షలు చేయించాలని చిన్నారుల తల్లిదండ్రులు అడగగా వారితో స్టాఫ్ నర్సులు దురుసుగా ప్రవర్తించడమేకాకుండా నిర్లక్ష్యంగా, అహంకార దోరణితో వ్యవహరిస్తున్నారు. రోగుల సహాయకులు కనీసం కూర్చునేందుకు పీటలు సైతం లేవు. రోగుల గదుల్లో ఫ్యాన్లు తిరగక పోవడంతో దోమలు విపరీతంగా పెరిగి నిద్ర పట్టక అవస్థలు పడుతున్నారు. చిన్నారులకు జ్వరమొచ్చిందని ఆస్పత్రికి తీసుకొస్తే తల్లులు జ్వరాల బారిన పడుతున్నారు. అంత పెద్ద ఆస్పత్రిలో కనీసం మంచినీటి సదుపాయం లేకపోవడంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు మాతా శిశు కేంద్రాన్ని సందర్శించి రోగులు ఉండే గదులు, మరుగుదొడ్లను ఇతర పరిసరాలను వెంటనే పరిశుభ్రం చేయించాలని రోగులు వారి సహాయకులు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.





# వర్షాలకు దెబ్బతిన్న మెట్ట పంటలు





(మొదటిపేజీ తరువాయి)

లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వరి తర్వాత ప్రధాన పంట పత్తి. వ్యవసాయ సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు పత్తి పంట వేశారు. తర్వాత వచ్చిన వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తి అంతగా ఎదగ లేదు. ఆ తర్వాత ఇప్పుడు ఎడతెరిపి లేనివర్షాల కారణంగా పత్తి చేలలో నీరు నిలిచాయి. వాగులు, నదులు, మున్నేరు, వైరా నది, కట్టలేరు తదితర నదుల పరివాహక ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి. గతేడాది సెప్టెంబర్‌లో కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు ఇప్పటికీ కోలుకోలేదు. కొన్ని భూములు వ్యవసాయ యోగ్యానికి కూడా పనికిరాకుండా పోయాయి. మళ్లీ ఈ ఏడాది కూడా కొద్ది రోజులు వర్షాభావ పరిస్థితి ఇప్పుడు జోరు వర్షాల కారణంగా రైతులు దెబ్బతిన్నారు. పంట నష్టాలను అంచనా వేసి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

# ఇసుకాసురుల ఇష్టారాజ్యం..!



(మొదటిపేజీ తరువాయి)

ఏర్పడి వర్షాకాలంలో నీరు గోతుల్లో నిల్వ ఉండటంతో తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. ఇసుక ర్యాంపుల నుండి ప్రతి రోజూ వందలాది లారీలు తిరుగుతుంటాయి. ఇదిలా ఉండగా చర్ల నుండి భద్రాచలం రావడానికి దుమ్ముగూడెం మండల తర్వాత ఏపిలోని ఎటపాక మండలం తగులుతుంది. దీంతో సరిహద్దు సమస్య ఏర్పడింది. భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తిరగాలన్నా ప్రాణ సంకటంగా మారింది. ఈ మధ్య కాలంలో ఆ గోతుల్లో కార్లు, ఆటోలు దిగబడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**అధికారుల చోద్యం...**

ఓవర్ లోడింగ్‌తో లారీలు తిరుగుతున్నప్పటికీ సంబంధిత రవాణాశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దును పంచుకుని ఉండటంతో అక్కడి అధికారులు కూడా పట్టించుకునే పరిస్థితి లేదు.

**పట్టించుకోరా...**

రహదార్లు పెద్ద ఎత్తున దెబ్బతింటున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎవ్వరూ పట్టించుకోక పోవడంతో పరిస్థితి భయానకంమగా మారింది. ఓవర్ లోడింగ్ తగ్గించలేక పోతుండటంతో పాటు రోడ్లను కాపాడలేక పోతున్నారు. ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు చొరతీసుకుని ఇక్కడి అధికారులకు ఆదేశాలు జారీ చేసి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

# మామూళ్ల మత్తు.. నాణ్యత గల్లంతు..!

(మొదటిపేజీ తరువాయి)

విక్రమార్క లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. గతేడాది నవంబర్ ఏడున నాగులవంచ నుండి మండల కేంద్రమైన చింతకానికి రోడ్డుకు భట్టివిక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 5.40 కోట్లు వెచ్చించారు. ఈ రహదారి నిర్మాణంతో మండల కేంద్రానికి త్వరితగతిన చేరుకోవడంతో పాటు రైతులకు ఈ రహదారి ఎంతో ఉపయోగపడుతుంది. పది కాలాల పాటు మన్నాల్సిన రోడ్డు నాణ్యత లేమి కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యమైన గ్రావెల్ తోలాల్సి ఉండగా అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై చెరువు మట్టి, చౌడుమట్టి ఉపయోగించడంతో రోడ్డు ఇరువైపులా కోతకు గురైంది. కిలో మీటర్ల మేర ఇదే పరిస్థితి. ఇదే రోడ్డుకు ఖమ్మం, బోనకల్ ప్రధాన రహదారి కలిసే చోట వంతెన నిర్మించాల్సి ఉన్న నిర్మించలేదు. దీనితో నూతనంగా నిర్మించిన రోడ్డుకు గండిపడే అవకాశం ఉంది. రోడ్డుకు ఇరువైపులా రోడ్డు కోతకు గురికావడంపై పంచాయతీ రాజ్ ఏఈ రోహిత్‌ను వివరణ కోరగా ఈ రహదారి నిర్మాణంపై స్థానికులు ఎవరు ఫిర్యాదు చేయలేదని నాణ్యతకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు రాలేదని ఆయన తెలిపారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు రోడ్డును తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రోడ్డుకు ఇరువైపులా కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేయడంతో పాటు నాణ్యత లేమికి కారకులైన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## గుంతలమయంగా రోడ్డు

**-ప్రమాదకరంగా ప్రయాణం -పట్టించుకోని అధికారులు**



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని కల్లూరు నుంచి మధిర రహదారి, కల్లూరు సత్తుపల్లి ,తల్లాడ ,ప్రధాన రహదారులపై గుంతలు ప్రమాదకరంగా మారడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. గత వారం రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో ప్రధాన రహదారులపై గుంతలు ఏర్పడి వాటిల్లో నీరు నిలవబడి ఉండటంతో అకస్మాత్తుగా గుంటలోకి వెళ్లి ప్రమాదానికి గురవుతున్నట్లు ప్రయాణికులు తెలుపుతున్నారు. ప్రధానంగా కల్లూరు టు మధిర రహదారిలో అనేక గ్రామాలు ఉన్నాయని వందలాదిమంది ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారని ఈ సమయంలో అకస్మాత్తుగా వచ్చే గుంటలో వలన ప్రమాదానికి గురవుతున్నట్లు వాహనదారులు పేర్కొంటున్నారు గత వారం రోజుల నుంచి ఈ గుంతలు పై సంబంధిత శాఖ అధికారులకు తెలియపరచిన పట్టించుకోవటం లేదని వారు తెలుపుతున్నారు. అధికారులు స్పందించి ఈ గుంతలను పూడ్చాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు

## ఆశాలకు పారితోషికాలు వెంటనే చెల్లించాలి




**ప్రజాపక్షం/ములకలపల్లి:** ఆశ వర్కర్లకు జూలై నెల పారితోషకాలు వెంటనే ఇవ్వాలని తెలంగాణ ఆశా వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ ధనలక్ష్మి, సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో మంగపేట ప్రభుత్వ ఆసుపత్రి ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మండల వైద్యాధికారి కళ్యాణ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై నెల పరితోషకాలు ప్రభుత్వం ఆపడంతో ఆశా వర్కర్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఆశలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు నల్లి సుజాత, మండల నాయకురాలు కొర్రీ పద్మ, అన్నవరపు శైలజ, కుంజా కుమారి, కోడిమే ఇందిరా, మాలోత్ మాణిక్యమ్మ, తాటి దుర్గా, జ్యోతి, లలిత, మీనా, కళ్యాణి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షంతో అతలాకుతలం..!

**-రోడ్లపై నిలిచిన వర్షపు నీరు**
**-గుంతలు పడ్డ రహదారులు**



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** తుఫాన్ కారణంగా గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి కొత్తగూడెం పట్టణ ప్రాంతవాసులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఉపాధ్యాయులు ఉద్యోగులు, కూలీ పనులకు వెళ్లే వారు అనేక ఇబ్బందులు పడ్డారు. మంగళవారం కొత్తగూడెం పట్టణంలో భారీ వర్షం కురిసింది. పట్టణంలోని రోడ్లు పలు కాలనీలు జలమయమైనాయి. వర్షం కారణంగా నిత్య అవసరాలను తీర్చుకొనుటకు సైతం జనాలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఈ వర్షం తీవ్రతతో పలు రకాల పంటలు నీట మునిగాయి. రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.పెరుగుతున్న ధరలకు వ్యవసాయదారుడు ఇబ్బందులు పడుతున్న నేటి రోజుల్లో ఇటువంటి వరదల వల్ల రైతులకు అధికంగానే నష్టం చేకూరుతుంది. ఈ భారీ వర్షాల వల్ల వాగులు వంకలు పొరలి జనాల రాకపోకలకు అనేక ఇబ్బందులు వాటిల్లాయి. పట్టణ, గ్రామాల్లోని రోడ్డు మార్గాలు సైతం గుంతలు పడినాయి, కుంటలు చెరువులు నిండు కుండలమారాయి.పలు రకాల వీధి వ్యాపారస్తులు సైతం ఈ వర్షాభావం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు.

# సీజనల్ వ్యాధులపై దృష్టి సారించండి

**-కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి ఆసుపత్రి భవనాలను ప్రారంభించండి**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జోరుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అధికార యంత్రాంగం దీనిపై దృష్టి సారించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. ప్రతి యేటా సీజనల్ వ్యాధుల బారీన పడి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఇప్పటికే కొణిజర్ల మండలంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని ఆయన తెలిపారు. వ్యాధులు ప్రబలుతున్న గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల్లో తగినన్ని మందులు సరఫరా చేయడంతో పాటు సిబ్బందిని నియమించాలని అవసరమైతే అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం కావాలని సురేష్ కోరారు. పెనుబల్లి, కల్లూరు, సత్తుపల్లి సహా జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఆసుపత్రి భవనాలు నిర్మాణం పూర్తి చేసుకుని కాంట్రాక్టర్ అప్పగించినా ప్రారంభించడం లేదని శిథిల భవనాల్లో వైద్య సేవలను అందిస్తున్నారని ఆయన తెలిపారు. తక్షణం భవనాలను ప్రారంభించాలని ఆయన కోరారు. ఎడ తెగని వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా మెట్ట పంటలు దెబ్బతిన్నాయని నదులు, వాగులు, ఏర్ల పరివాహక ప్రాంతంలో పంట పొలాలు నీట మునిగాయని నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకునేందుకు పరిహారం ప్రకటించాలని సురేష్ డిమాండ్ చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలను రక్షించుకునేందుకు ప్రతి గ్రామంలోనూ వ్యవసాయ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి సూచనలు అందజేయాలని ఆయన కోరారు.

# రాష్ట్రపతి అవార్డు గ్రహీత దుగ్గినేని మృతి

**-ఎస్‌జిపిఎటి, ఎస్టియు సంఘాల నివాళి**



**ప్రజాపక్షం/ఖమ్మం :** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయునిగా రాష్ట్రపతి డా॥ శంకర్‌దయాళ్‌శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ప్రముఖ ఉపాధ్యాయ నేత దుగ్గినేని సత్యనారాయణరావు (94) మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మధిర మండలం ఇల్లూరు గ్రామానికి చెందిన దుగ్గినేని 1955లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. మధిర ఉన్నత పాఠశాలలోనూ, ఉపాధ్యాయ శిక్షణా కేంద్రంలోనూ పని చేశారు. ఖమ్మం జిల్లాలోని పలు పాఠశాలల్లో పని చేసిన దుగ్గినేని ఎందరినో ఉత్తమ పౌరులుగా, ఉపాధ్యాయులుగా తీర్చిదిద్ది తల్లిదండ్రుల ప్రశంసలు పొందారు. ఉపాధ్యాయ ఉద్యమంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన దుగ్గినేని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా, రాష్ట్ర అధ్యక్షులుగా పని చేశారు. కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 56 రోజుల పాటు జరిగిన సమ్మెకు దుగ్గినేని నేతృత్వం వహించారు. చివరకు డిఏ పెంపును సాధించారు. ఖమ్మం జిల్లాలో ఎస్టియు బలోపేతానికి కృషి చేయడంతో పాటు సంఘ కార్యాలయాన్ని నిర్మించడంలో కీలక భూమిక పోషించారు. 1984లో 29 ఏళ్ల పాటు పనిచేసిన అనంతరం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఆ తర్వాత శాసన మండలికి పోటీ చేసి ఓటమి చెందారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన దుగ్గినేని అప్పట్లో కమ్యూనిస్టు పార్టీ నాయకులతో పాటు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించిన శీలం సిద్దారెడ్డి, జలగం వెంగళరావు లతో సన్నిహితంగా ఉంటూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. దుగ్గినేని చేకూరి కాశయ్యతో కలిసి గురుదక్షిణ ఫౌండేషన్ స్థాపనకు కృషి చేశారు. దుగ్గినేని మృతి పట్ల రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఎస్టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొడ్డా వరప్రసాద రావు, ఎస్‌కె కరీం, గురుదక్షిణ ఫౌండేషన్ అధ్యక్షులు శంకరయ్య, సెక్రటరీ చావా శ్రీనివాసరావు, విశ్రాంత మండల విద్యాధికారి దుగ్గినేని శ్రీనివాసరావు, రామనుజస్వామి సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదు కట్టుదిట్టంగా నమోదు చేయాలి

**-సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీజ**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరు కట్టుదిట్టంగా నమోదు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ ఎఫ్‌ఆర్‌ఎస్ విధానంలో హాజరు నమోదుపై విద్యాశాఖాధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాశాఖ పరిధిలో వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలల వారీగా పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చాలన్నారు. భవిత కేంద్రాల మరమ్మతు, అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల గైర్హాజరుకు గల కారణాలు తెలుసుకుని ఫాలోఅప్ చేస్తూ విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు వచ్చేవిధంగా చూడాలన్నారు. ఉపాధ్యాయులకు సెలవు మంజూరు అంశంలో ప్రణాళికాబద్దంగా వ్యవహరించాలన్నారు. టీచర్లు విద్యార్థుల హాజరు అంశం అత్యంత ప్రాధాన్యతగా పరిగణించడం జరుగుతుందన్నారు. ప్రతి వారం తక్కువ ఎఫ్‌ఆర్‌ఎస్ ఉన్న ఐదు మండలాల కాంప్లెక్స్ పరిధిలో ఎఫ్‌ఆర్‌ఎస్ అమలు, పాఠశాల నిర్వహణ పట్ల సమీక్ష నిర్వహించుకోవాలన్నారు. యుడిఐఎస్‌ఈ పోర్టల్‌లో పాఠశాలకు సంబంధించిన వివరాలను అప్‌డేట్ చేయాలన్నారు. ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, హెడ్ మాస్టర్లతో సమన్వయం చేసుకుంటూ వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఆగస్టు చివరి నాటికి అపార్ నెంబర్ జనరేట్ చేయాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారిణి నాగపద్మజ, విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# యూరియా కొరతను నివారించాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలో రైతులకు అవసరమైన యూరియా అందటం లేదని, సంబంధిత అధికారులు యూరియా కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సేలం సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు పలు సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయానికి ప్రధానమైన రసాయన ఎరువు యూరియా మండలానికి కోటాను పెంచి అందరికి అందించాలని అన్నారు. సాంకేతికపరమైన బయోమెట్రిక్ విధానాన్ని సడలించి ఓటిపి ద్వారా అందించాలని, ముఖ్యంగా కౌలు రైతులకు యూరియాను అందించాలన్నారు. అదేవిధంగా మండలంలో రైతుల సమస్యలను భూ భారతి చట్టం, గ్రామ సభల ద్వారా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి నల్లమోతు మోహన్‌రావు, మండల అధ్యక్షులు కళ్యాణపు కృష్ణయ్య, అయినాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, చల్లా నాగేశ్వరరావు, గుంటుపల్లి వెంకటయ్య, కళ్యాణపు మధు, కొల్లి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# పువ్వాడ జయశ్రీకి పితృవియోగం

**-బొందలపాటి కృష్ణయ్య మృతి పలువురి నివాళి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మమత ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి పువ్వా డ జయశ్రీ తండ్రి బొందలపాటి కృష్ణయ్య (75) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. గత కొంత కాలంగా కృష్ణయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కృష్ణయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కృష్ణయ్య మృతివార్త తెలిసిన వెంటనే పలువురు ఖమ్మంలోని ఆయన స్వగృహంకు చేరుకుని నివాళులర్పించారు. మాజీ శాసనసభ, శాసన మండలి సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, నాయకులు యర్రా బాబు, ఏనుగు గాంధీ, బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు పగడాల నాగరాజు, బిఆర్‌ఎస్ పక్ష నాయకులు కర్నాటి కృష్ణ, మమత డైరెక్టర్ పువ్వాడ నరేన్, ప్రముఖ వైద్యులు వైవి రావు, బాగం కిషన్‌రావు, శ్రీకాంత్, బండారుపల్లి నవీన్, పొన్నం వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖ వైద్యులు, వివిధ రంగాల ప్రముఖులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డు అందుకున్న సంపత్




**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర స్థాయిలో జరిగిన ఫోటోగ్రఫీ పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన చావా సంపత్‌కుమార్ మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాన్ని పొందారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీల్లో ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ చావా సంపత్‌కుమార్ ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం విభాగాల్లో ప్రథమ బహుమతిని పొందారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని గ్రీన్‌పార్కు హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి శ్రీనివాసరెడ్డి ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



**ప్రజాపక్షం/ తల్లాడ :** మండల కేంద్రం తల్లాడలో ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవ వేడుకలను ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అధ్యక్షులు గుమ్మా రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఫొటోగ్రాఫర్ పితామహుడు లూయిస్ మండేడాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తల్లాడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి ఫొటో గ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ చిట్టెం రామారావు, గుమ్మా నరేష్, గురిజాల నారాయణరావు, ఎస్కె ఆసిఫ్, గోపిశెట్టి నరేష్, నాగబాబు, కిషోర్, శీలం కర్ణాకర్‌రెడ్డి, కాసర్ల నరేష్, పోలిస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** ప్రజల ఆరోగ్యం కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిపిఎం మండల కార్యదర్శి ఆయినాల రామలింగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని చేస్తున్న ధర్నాకు సిపిఎం మండల కమిటీ మద్దతు తెలిపింది. యూనియన్ నాయకురాలు తాళ్ల రాణి అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ఆశా వర్కర్లు వెట్టిచాకిరి చేస్తున్నా సరైన వేతనాలు లేక ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆశాల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పులి కృష్ణయ్య, కళ్యాణపు కృష్ణయ్య, షేక్.మస్తాన్, చల్లా నాగేశ్వరరావు, గుంటుపల్లి వెంకటయ్య, సత్తెనపల్లి వీరరాఘవులు, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు ముచ్చింతల ఎల్లారావు, శంకర్, ధనలక్ష్మి , కృష్ణకుమారి, ఉమా, జ్యోతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించాలి



**ప్రజాపక్షం/ మధిర :** పర్యావరణానికి ముప్పుగా పరిణమించిన ప్లాస్టక్ వాడకం రోజురోజుకు పెరిగిపోతుందని, వీటి నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని హ్యూమన్ రైట్స్ సొసైటీ సభ్యులు కోట వెంకట్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నిబంధనల ప్రకారం వీటి వినియోగం జరగడం లేదని, ప్రభుత్వ నిషేద చట్టం కాగితాలకే పరిమితమైందని అన్నారు. అప్పుడప్పుడు నిషేధ చట్టాన్ని గుర్తు చేస్తూ మున్సిపల్, కార్పొరేషన్ అధికారులు తూ..తూ.. మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ చిన్న చిన్న వ్యాపరస్తులకు జరిమానాలు విధించటం పట్ల అధికారుల్లో కూడా నిర్లక్షం స్పష్టంగా కన్పిస్తుందన్నారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు ఉత్పత్తి చేస్తున్న కంపెనీలపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదో ప్రజలకు అర్థంకాని ప్రశ్నఅని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# పాడి పశువుల కొనుగోలులో నిబంధనలు పాటించాలి

**-ప్రతి పాడి పశువుకు బీమా సౌకర్యం కల్పించాలి**
**- అదనపు కలెక్టర్ శ్రీజ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పాడి పశువుల కొనుగోలులో నిబంధనలు పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ ఇందిరా మహిళా డెయిరీ గ్రౌండింగ్ పై సంబంధిత అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరా మహిళా డెయిరీ గ్రౌండింగ్‌లో భాగంగా ఒక్కో లబ్దిదారుకు రెండు పాడి పశువుల చొప్పున పంపిణీ చేయాల్సి ఉంటుందని, పాడి పశువుల కొనుగోలు కోసం కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాడి పశువుల కొనుగోలు, రవాణా, బీమా సౌకర్యం కల్పన తదితర అంశాలలో పాటించాల్సిన విధానాలపై చర్చించి పలు సూచనలు చేశారు. పాడి పశువుల పంపిణీతో పాటు అవసరం, అవకాశం ఉన్న చోట ఉపాధి హామీ పథకం నిధులు వినియోగించుకుంటూ పశువుల షెడ్ల నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. మన జిల్లాలో ఉన్న వాతావరణంకు అలవాటు పడే పశువులను కొనుగోలు చేయాలని, పాడి పశువులు కొనుగోలులో నిర్దేశిత నిబంధనలను అధికారులు తూచ తప్పకుండా పాటించాలన్నారు. రవాణా కోసం పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకుల వారీగా లబ్దిదారుల కేటాయింపు, జాయింట్ ఖాతా ప్రారంభం నిర్దేశిత లక్ష్యం ప్రకారం పూర్తి కావాలన్నారు. పశువుల కొనుగోలు పూర్తయిన తర్వాత బ్యాంకు ఖాతా ద్వారా చెల్లింపులు చేయాలన్నారు. ప్రతి మండలంలో లబ్దిదారులకు ఎక్కడి నుంచి పాడి పశువులు కొనుగోలు చేయాలనే అంశంపై ఫైనల్ చేయాలన్నారు. పాడి పశువుల కొనుగోలు రెండు నుంచి మూడు రోజులు పట్టే అవకాశం ఉన్నందున అక్కడ వసతి సౌకర్యాలను ముందస్తుగానే ప్లాన్ చేసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ప్రతి పాడి పశువుకు జియోట్యాగ్ వేయాలన్నారు. ఎటువంటి అక్రమాలకు ఆస్కారం ఇవ్వకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కొనుగోలు చేసే ప్రతి పాడి పశువు ఆరోగ్య స్థితిగతులను వెటర్నరీ వైద్యుడు పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, ఎస్సి, గిరిజన సంక్షేమ శాఖాధికారులు , ఎంపిడివోలు, బ్యాంకు అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రానైట్ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు

**-మధ్య, చిన్నతరహా పరిశ్రమలను ఆదుకోవాలి**
**-సిపిఎం ఆధ్వర్యంలో**
**జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** గ్రానైట్ పరిశ్రమ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని వివిధ పార్టీల నేతలు, గ్రానైట్ పరిశ్రమ యజమానుల సంఘాల బాధ్యులు డిమాండ్ చేశారు. ఉపాధి కల్పించే మధ్య, చిన్నతరహా పరిశ్రమలను ఆదుకోవాలని, పెంచిన రాయల్టిని, పర్మిట్ ఛార్జీలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రౌండ్ టేండ్ సమావేశం స్థానిక హరిత గార్డెన్స్‌లో గ్రానైట్ అసోసియేషన్ బాధ్యులు తమ్మినేని కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ 12 ఏళ్లుగా రావాల్సిన రూ. 20 కోట్ల సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన 40 శాతం సబ్సిడీని పునరుద్దరించాలని, గ్రానైట్ ఉత్పత్తులపై ప్రస్తుతం 18 శాతం జిఎస్టి ఉందని దానిని ఐదు శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఐదు హెక్టార్ల లోపు క్వారీలకు షరతులు లేకుండా పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సమావేశం డిమాండ్ చేసింది. గ్రానైట్ సంక్షోభం లక్షలాది మంది కార్మికుల జీవనోపాధి సమస్యగా చూడాలని కోరారు. అంతర్జాతీయ మార్కెట్‌లో భారతదేశ పారిశ్రామిక ఉత్పత్తులుగా ఉన్న తెలంగాణ గ్రానైట్ కూడా ప్రధానమైందని ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. మధ్య, చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించక పోతే దేశమే ప్రమాదంలో పడుతుందని గ్రానైట్ సంక్షోభాన్ని దీర్ఘకాలిక దృష్టితో చూడాలన్నారు. గ్రానైట్ పరిశ్రమను ఆదాయ మార్గంగా కాకుండా ఉపాధిగా చూడాలని పలువురు సూచించరు. అనుమతుల విషయంలోనూ ఇబ్బందులు పెడుతున్నారని ఇదే రీతి కొనసాగితే మొత్తం గ్రానైట్ పరిశ్రమ ప్రమాదంలో పడుతుందన్నారు. జిల్లాలో ప్రధాన పరిశ్రమగా ఉన్న గ్రానైట్ క్రమేపి ప్రభావాన్ని కోల్పోతుందని ఈ విషయంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని గ్రానైట్ మనుగడ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రానైట్ పరిశ్రమ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలకు రౌండ్ టేండ్ సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు యుగంధర్, సిపిఎం జిల్లా నాయకులు శింగు నర్సింహారావు, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, న్యూడెమోక్రసీ నాయకులు మోహన్‌రావు, సిఐటియు జాతీయ నాయకులు మందడపు సాయిబాబు, వివిధ సంఘాల నాయకులు మాదినేని రమేష్, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, గాదె లక్ష్మి నారాయణ, రామయ్య, సాగర్, రియాజ్ తదితులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/మధిర :** ఆశాల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 25న నిర్వహించనున్న ఖమ్మం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తేలప్రోలు రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం మధిర పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో ఆశాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మధిర ప్రభుత్వాసుపత్రి ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశాల డిమాండ్ల సాధనలో భాగంగా ఈనెల 25 నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పడికంటి మురళీ, నాయకులు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులు చేధించేందుకు ప్రత్యేక బృందాలు

**-గంజాయి నియంత్రణపై పటిష్ట చర్యలు**
**-రెండు నెలల్లో రూ. 11 లక్షల విలువైన గంజాయి స్వాధీనం**
**-టౌన్ ఏసిపి రమణమూర్తి**



**ప్రజాపక్షం/ఖమ్మం :** చోరీ కేసులను చేధించేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి తెలిపారు. దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు సంఘటన స్థలంలో దొరికిన ఆధారాల మేరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి త్వరిత గతిన నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. సిసి పుటేజీల ఆధారంగా అనుమానిత వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. బహిరంగ మద్యపానం, అతివేగంతో వాహనాలను నడిపిన, సమయానికి మించి మద్యం షాపులను తెరిచి ఉంచినా, రోడ్లపై వేడుకలు నిర్వహించినా సిటీ పోలీస్ యాక్ట్ క్రింద కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. గంజాయి వినియోగాన్ని సమూలంగా నియంత్రించేందుకు నగర శివారు ప్రాంతాలతో అనుమానిత ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్, సిసి ఎస్ పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగిస్తున్నామన్నారు. ఖమ్మం డివిజన్‌లో 38 కేసులు నమోదు చేసి 167 మంది గంజాయి బ్యాచ్‌లను గుర్తించి 114 మందిని అరెస్టు చేయడం జరిగిందని వారి నుండి రూ. 11 లక్షల విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని రమణమూర్తి తెలిపారు.

## ఫోటో ఓ మధుర జ్ఞాపకం

**-ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా రక్తదాన శిబిరం**
**-మేయర్ నీరజ**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఫోటో ఓ మధు జ్ఞాపకమని గడిచిన తరాలను, ఘటనలను జ్ఞప్తికి తెచ్చేది ఫోటోలు మాత్రమేనని ఖమ్మం కార్పోరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. అద్భుతమైన జ్ఞాపకాలను బంధించేది ఫోటో అని ఫోటోగ్రఫీ ఓ అద్భుతమైన కళ అని ఆమె తెలిపారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా మంగళవారం భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక ఫోటో అనేక భావాలను వెల్లడి చేస్తుందని బంధాలకు, అనుబంధాలకు తార్కాణంగా నిలుస్తుందని నీరజ తెలిపారు. ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా జరిగిన పోటీల్లో విజేతలకు ఆమె బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా 150 మంది ఫోటోగ్రాఫర్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కమర్తపు మురళి, ఫోటోగ్రఫీ బాధ్యులు మారగాని వెంకట్, అశోక్, కనకారావు, తిరుపతిరావు, నాగరాజు, నర్సింహారావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## శంకర జ్యోతికి పిహెచ్‌డి పట్టా



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం జిల్లాలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న జి. శంకర జ్యోతికి గణిత శాస్త్రంలో పట్టా లభించింది. ది స్టడీ ఆన్ రెగ్యులర్ డైమన్ నేషన్ ఇన్ లిట్రిక్ గ్రాప్స్ అనే అంశంపై చేసిన పరిశోధన పత్రానికి ఆమెకు పిహెచ్‌డి పట్టా లభించింది. శంకర జ్యోతి మంచిర్యాల జిల్లా వెల్లంపల్లిలో విద్యను అభ్యసించారు. ఈ సందర్భంగా శంకర జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులకు గణితం సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన చేయాలనే లక్ష్యంతో పిహెచ్‌డి పూర్తి చేసినట్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో ఛైర్మన్ నారాయణ తదితరులు సమక్షంలో ఇస్రో ఛైర్మన్ నారాయణ, వైస్ ఛాన్సలర్ కుమార్ చేతుల మీదుగా పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా గైడ్‌గా వ్యవహరించిన డా॥ ఉపేందర్‌రెడ్డి గణిత విభాగం అధ్యాపకులకు, కుటుంబ సభ్యులకు శంకర జ్యోతి కృతజ్ఞతలు తెలిపారు.

## సెబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సైబర్ నేరాల పట్ల భారతీయ స్టేట్ బ్యాంక్ జిల్లా పరిషత్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. కళాకారులు సైబర్ నేరాల గురించి ఆటల పాటల రూపంలో ఖాతాదారులకు వివరించారు. మేనేజర్ షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లపట్ల జాగ్రత్తగా ఉండాలని అనుమానం వస్తే 1930కు కాల్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. ఎస్‌బిఐ బ్యాంక్ లావాదేవీల కొరకు 1800, 1234 ద్వారా వివరాలు తెలుసుకోవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోండి

**-రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తుపాన్‌కు పంటలు నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ తెలిపారు. ఎడతెగని వర్షాల కారణంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ఇప్పటికే ఎకరాకు రూ. 50వేల వరకు రైతులు పెట్టుబడులు పెట్టారని వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మెట్ట పంటలు తీవ్రంగా నష్టపోయాయని ముఖ్యంగా పెసర, మినుము, ఇతర అపరాల పంటలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని దొండపాటి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం పెడ చెవిన పెడుతుందని పంటల బీమా పథకాన్ని అమలు చేస్తే ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు పరిహారం అందుతుందని ఆయన తెలిపారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు తక్షణం పంటల నష్టాన్ని అంచనా వేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు స్వర్ణ రమేష్, తండు సోమయ్య, సీతారాములు, కొమ్మినేని వెంకయ్య, తుప్పర్తి వెంకటేశ్వర్లు, వెంకట్రాది, వజీర్, బండారు కిషన్ తదితరులు ఉన్నారు.

## అంగన్వాడి సేవలపై సమీక్ష

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని ఐ సి డి ఎస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన అంగనవాడి సిడిపిఓ జ్యోతినిర్మల లు ఎసిడిపిఓ సూపర్వైజర్లు తమ సిబ్బందితో కల్లూరు, తల్లాడ, పెనుబల్లి,మూడు మండలాల్లో గర్భిణీలు బాలింతలకు చిన్నపిల్లలకు అమలవుతున్న సంక్షేమ పథకాల పౌష్టికాహారం అందుతున్న తీరుపై సమీక్ష సమావేశంజరిగింది. అద్దెభవనాల్లో ఉన్న శిథిలావస్థ భవనాల్లో ఉన్న అంగన్వాడి కేంద్రాలను క్షేమకరంగా ఉన్న అంగన్వాడి కేంద్రాల్లోకి మార్చాలని అదేవిధంగా మరుగుదొడ్లు పక్కాభవనాలు లేని వాటికి కొత్తగా మంజూరైనట్లు పేర్కొన్నారు. మరియు ముఖ హాజరుపై, పౌష్టికాహారం అందుతున్న తీరు 0 5 చిన్న పిల్లలు పెరుగుతున్న బరువు రక్తహీనత పై సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తెలిపారు. సూపర్వైజర్లు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేసి ఆన్లైన్లో ఫోటోలను పొందుపరచాలని పేర్కొన్నారు.

# అనుమతులున్నట్టా..? లేనట్టా...?



**- యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన**
**- ఒకే పన్ను ఒకే విధానికి పంగనామం..?**
**- పట్టించుకోని అధికారులు**
**- కలెక్టర్‌ని కలిసేందుకు సిద్ధమవతున్న నిర్వాసితులు**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్‌:** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల ఓ రైస్‌మిల్‌తో అక్కడి నిర్వాసితులు పడుతున్న దయనీయ దుస్థితిపై ప్రజాపక్షం గత రెండు రోజులుగా వరుస కథనాలు ప్రచురిస్తున్న విషయం పాఠకులకు విధితమే. ఈ నేపథ్యంలో అనేక కొత్తకొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. అసలు ఆరైస్‌మిల్‌కు అనుమతులున్నట్టా...?లేనట్టా...? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే సదరు రైస్‌మిల్ నిర్వాహకుడు తను 30సంవత్సరాలకు పైగా నిర్వహిస్తున్నట్లు తెలుపుతుండటంతో ఈ ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. ఆ సమయంలో రైస్‌మిల్ ఏర్పాటు చేసినప్పుడు అక్కడి పరిస్థితులకు అనుగునంగానే అనుమతులు పొందిఉండవచ్చును. కానీ ఇప్పుడు ఆ ప్రాంతంలో ఇండ్ల సముదాయాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రస్థుత పరిస్థితులకు సంబంధించిన నిబంధనలు ఉంటాయి. అందులోనూ ప్రధానంగా 2016లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దేశమంత ఒకే పన్ను ఒకే విధానం అత్యంత ముఖ్యమైనది. వ్యాపారం చేసే ప్రతి ఒక్కరు తప్పకుండా జిఎస్‌టీ పన్నును చెల్లించాల్సి ఉంది. ఇప్పుడు రైస్‌మిల్‌కు ఉందా?లేదా? అనే చర్చ తెరపైకి వచ్చింది. దీనిని జిఎస్‌టీ అధికారులు తనిఖీ చేయడం ద్వారా తేలనుంది.

**పట్టించుకోని అధికారులు...**

నిర్వాసితుల దుస్తితిపై ప్రజాపక్షం ప్రచురిస్తున్న కథనాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలో అక్షరమే ఆయుధంగా నిర్వాసితులు, రైస్‌మిల్ నిర్వాహకుడిని నిలదిశారు. అయినప్పటికీ అధికారులు కనీసం అక్కడి పరిస్థితిపై మిన్నకుంటుండటం ప్రజలలో పలు అనుమానాలకు తావిస్తున్నాయి. సుమారు 300వందల వరకు కుటుంబాలు నివసిస్తున్నారు. వీరిలో చిన్నారులు, పెద్దలు శ్వాసకోశతో బాధపడుతున్నారు. అలాగే వర్షాలతో రైస్‌మిల్ అపరిశుభ్రతతో దుర్వాసన వెదజల్లి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఇంతటి దయనీయ దుస్థితిని చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికి పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నిర్వాసితులు జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

**నిబంధల ఉల్లంఘన...**

రైస్‌మిల్ ఏర్పాటులో నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించినట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. అందులోని పొట్టు. దుమ్ము, ధూళిరాకుండా షెడ్డు, కాలుష్యంను నివారించేందుకు గ్రీనరీ ఉండేలా చెట్లు పెంచాల్సి ఉంది. ఇవి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాలుష్యబోర్డు సూచనల మేరకు ఎన్‌ఓసీ పొందిఉంటే ఇవ్వి తప్పకుండా పాటించాలి. కానీ అవేమి అక్కడ కనిపించడం లేదు. అంతేకాకుండా ఆహార పరిశ్రమ నుండి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌తో పాటు లైసెన్సులు కలిగి ఉండాలి. అప్పుడు ఏర్పాటులో పరిస్థితితుల నిబంధనలకు, ఇప్పటి పరిస్థితులకు నిబంధనలలో సమూల మార్పులు వచ్చాయి. కావున సబంధిత అధికారులు తనిఖీలు చేసి నిబంధనల మేరకే ఉందో?లేదో? తెలుసుకోవాల్సిన అవశ్యకతను నొక్కి చూపిస్తున్నాయి.

# వైరా మండలంలో నకిలీ విలేకరుల హల్‌చల్

**-బ్యూరో అంటూ బెదిరింపులు**
**-బ్యూరో తిరుగుతూ పర్యటనలు**
**-పోలీసులు దృష్టి సారిస్తే నకిలీలకు చెక్**

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో గత 15 రోజుల నుంచి రకరకాల పత్రికలు టివి ఛానల్‌ల పేరుతో నకిలీ విలేకరులు తిరుగుతూ బెదిరింపుల పర్వానికి పాల్పడుతున్నారని వాదనలో భారీగా వినిపిస్తున్నాయి. నలుగురైదురు వ్యక్తులు కలిసి కారులో తిరుగుతూ మేము జిల్లా బ్యూరోలం అని రకరకాల పత్రికల పేరుతో వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి వారిని ఇబ్బందులకు గురిచేస్తూ పర్యటనలు జరుపుగుతున్నారు. గడిచిన 15 రోజుల్లో వైరా మున్సిపాలిటీతో పాటు వైరా మండలంలో పలు గ్రామపంచాయతీల్లో వ్యాపార సముదాయాల వద్దకు వెళ్లి కారులో కొందరు కూర్చొని ఉంటే మరికొందరు బయట దిగి షాపుల వద్దకు వెళ్లి జిల్లా బ్యూరో వచ్చారు. మీ షాపుల్లో ఏం జరుగుతుందో మాకు తెలుసు మీ ఊర్లో ఏం జరుగుతుందో మాకు తెలుసు మారు మాకు సహకరిస్తే మంచిది లేకుంటే ఇబ్బందులు పడతారు అంటూ పలువురిని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో కొంతమంది నకిలీ విలేకరులు రకరకాల పుస్తకాలను రసీదుల రూపంలో కొట్టించుకొని వాటిపై ఎలాంటి పేరు ఊరు లేకుండా న్యూస్ అనే పేరు న్యూస్ పేరుతో షాపుల వద్దకు వెళ్లి సందాల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పోలీసులు వీరిపై నిఘా పెడితే నకిలీలకు చెక్ పెట్టవచ్చు. ఇప్పటికే రాత్రి పగలు కొంతమంది వ్యక్తులు కారులో రకరకాల హోదాల్లో పేర్లు చెప్పుతూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని ఆరోపణలు లేకపోలేదు. నిజమైన పత్రికా విలేకరులకు టివి ఛానల్ విలేకరులకు నకిలీలతో ఇబ్బంది కలుగుతుందనే చెప్పవచ్చును. వైరా మండలంలో ప్రముఖ పత్రికలో టివి ఛానల్‌లో పనిచేసే మీడియా ప్రతినిధులు చాలావరకు అందరికి తెలిసిన వారే కాని కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి మండలలో పర్యటిస్తూ బెదిరింపులకు పాల్పడుతూ వసూళ్లకు తెరలేపుతున్నారు. ఇదే క్రమంలో ఎవరు నకిలీ ఎవరు ఒరిజినల్ అనే విషయాన్ని ప్రజలు తెలుసుకోలేని పరిస్థితిలో కూడా ఉన్నారని చెప్పవచ్చును. ప్రజలు కూడా ఎవరైనా వచ్చి మీ వ్యాపార సముదాయాల వద్ద మిమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్న సమయంలో మీకు తెలియని వ్యక్తులని గుర్తిస్తే వెంటనే పోలీస్ వారికి కాని లోకల్‌గా ఉన్న మీడియా ప్రతినిధులు గాని సమాచారం ఇస్తే నకిలీల బాగోతానికి అడ్డుకట్ట వేయవచ్చు.

## దాతల సహకారం మరువలేనిది

**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం మరువలేనిదని హెచ్‌ఎం చెరుపల్లి శ్రీహరి అన్నారు. మంగళవారం మాటూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెం దిన మేడిశెట్టి నాగేశ్వరరావు, కొట్టే రాంబాబు చొరవతో మాటూరు పుష్ప ఆర్థిక సహకారంతో స్కూల్ డైరీలను అందచేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం శ్రీహరి మాట్లాడుతూ గ్రామస్తుల సహాయ సహకారాలతో పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో చక్కగా రాణిస్తున్నారని, ముఖ్యంగా గ్రామానికి చెందిన పుష్ప గత సంవత్సరం పాఠశాల లాంగ్ జంప్ పిట్ ఏర్పాటు చేయటానికి రూ.15వేలు ఆర్థిక సహాయం అందించారని, దాత పుష్పకు పాఠశాల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అడపాల వెంకటేశ్వర్లు, మేడిశెట్టి నాగేశ్వరరావు, పల్లపాటి కోటేశ్వరరావు, పడిగల నాగరాజు, వెంకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఫొటోగ్రఫీలో మెరిసిన ముత్యాల




**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం సోమవరం గ్రామానికి చెందిన ముత్యాల నాగేశ్వరరావు ఫొటోగ్రాఫిలో మెరిసిన ముత్యం అనే పేరును తాను సొంతం చేసుకున్నాడు. జిల్లా ఫొటో వీడియోగ్రాఫి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో అంతర్జాతీయ ఫొటోగ్రాఫి దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ఫొటోగ్రాఫి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఓపెన్ విభగంలో వైరా సోమవరం గ్రామానికి చెందిన ముత్యాల నాగేశ్వరరావు తీసిన చిత్రానికి ఉత్తమ అవార్డు లభించింది. ఈ అవార్డును ఖమ్మం జిల్లా మేయర్ పునుకొల్లు నీరజ చేతుల మీదుగా అందుకున్నారు. గతంలో కూడా ముత్యాల నాగేశ్వరరావుకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో అనేక అవార్డులు అందుకున్నారు. ఈ అవార్డు రావడం పట్ల వైరా మండల ఫొటోగ్రాఫర్స్ హర్షం వ్యక్తం చేస్తూ మున్ముందు ఇంకా ఎన్నో అవార్డులు రావాలని మండలానికి మంచి పేరు తీసుకురావలని అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా కాంగ్రేస్ నాయకులు కార్పొరేటర్ కామర్తపు మురళి, ఫొటోగ్రాఫి అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, దేవర ఫొటోగ్రాఫి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మారగని వెంకట్, ప్రధాన కార్యదర్శి కనకరావు, తిరుపతిరావు, కన్నీగొండ్ల అశోక్, జిల్లా కార్యవర్గం సభ్యులు, తోటి ఫొటోగ్రాఫర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తుఫాన్ మార్క్‌డ్రైవ్‌పై అవగాహన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్‌:** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని జలగంనగర్‌లో గల మండల పరిషత్ కార్యాలయంలో తుఫాన్ విపత్తుపై మార్క్ డ్రైవ్‌ను ఎన్‌డిఆర్ఎఫ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ రాంప్రసాద్ పర్యవేక్షణలో అధికారులకు మంగళవారం అవగాహణ కల్పించారు. వరద విపత్తులో ప్రజలను ఎలా? అప్రమత్తం చేయవచ్చునో వివరించారు. ప్రధానంగా దీనిని నేటి ఉదయం 10:30గంటలకు కస్నాతండాలో నిర్వహించనున్న మార్క్ డ్రైవ్ నేపథ్యంలో చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఎంపిడీఓ శ్రీదేవి, పిహెచ్‌సి వైద్యుడు బాలకృష్, ఎన్‌డిఆర్‌ఎఫ్ అధికారి జగదీష్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థికి ల్యాప్టాప్ అందజేసిన నందిని



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన తాళ్లూరి పుల్లారావు కుమార్తె గీత శరణ్యకు బిటెక్ మొదటి సంవత్సరం హైదరాబాద్‌లో చదువుతుంది. గీత శరణ్యకు మధిరలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మల్లు నందిని ల్యాప్టాప్‌ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లు నందిని మాట్లాడుతూ కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చి ఉన్నతస్థాయిలో ఉండాలని గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీఠ వేస్తుందని మల్లు నందిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రేస్ నేతలు పాల్గొన్నారు.

## ఈదాకు ఎకరం భూమి కేటాయించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో ముస్లీం సోదరులు రంజాన్ పండుగ సమయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకునేందుకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మంగళవారం జిల్లా కాంగ్రేస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ కలిసి చెరువు బజార్‌లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి ఆద్గా కోసం ఎకరం భూమి కేటాయించారు. స్థలం ఎమ్మార్వో, మున్సిపాల్ కమీషనర్‌ను ఈద్గా ఏర్పాటుకు చర్యలు చేపట్టారని ఆదేశించారు. ఈ సందర్భంగా ముస్లీం సోదరులు శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రేస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రేస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, దాసరి దానియేలు, వేముల కృష్ణప్రసాద్, పమ్మి అశోక్, ఆది ఆనందరావు, షేక్ సోందు సాహెబ్, షేక్ బాబుజాని, షేక్ కౌసర్, షేక్ మీరా, ముస్లీం పెద్దలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వైరా:** వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మంగళవారం వైరా రిజర్వాయర్ ప్రక్కన ఉన్న నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని జిల్లా కాంగ్రేస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ప్రైవేటు భవనాల్లో ఉంటున్న ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్‌శాఖ, సబ్ రిజిస్టర్, ఎక్సైజ్‌శాఖ, అగ్రికల్చర్‌తో పాటు పలు కార్యాలయాలకు భవనాలు కట్టే విధంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రత్యేక దృష్టి సారించి పక్కా భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు ఉండాలని ఉద్దేశ్యంతో స్థలాలను పరిశీలించారు. వైరాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పక్కా భవనాలు ఉండేవిధంగా చేయడం జరుగుతుందని రాందాస్‌నాయక్ అన్నారు. ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు పక్కా భవనాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ అధికారులు, కాంగ్రేస్ నాయకులు పాల్గొన్నారు.

## డిజె శబ్దాలు నిషేధం

### ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు

**ప్రజాపక్షం/వైరా:** ప్రజలకు ఇబ్బంది కలిగించే శబ్దాలు నిషేధించడం జరిగిందని ఎవరైనా నిబంధనలను అతిక్రమించి డిజెలు పెడితే చట్టపరంగా చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని వైరా సిఐ నునావత్ సాగర్ అన్నారు. మంగళవారం వైరా పోలీస్‌స్టేషన్‌లో సిఐ సగర్, ఎస్సై పుష్పాల రామారావుతో కలిసి డిజె నిర్వాహకులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణపతి నవరాత్రులు జరుగుతున్న నేపద్యంలో దృష్టిలో కౌన్సిలింగ్ నిర్వహించారు. శుభకార్యాలతో మతపరమైన ఊరేగింపుల్లో మైకులు మినహా శబ్ద కాలుష్య వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. నిబంధనలు ఎవరు అతిక్రమించవద్దని అన్నారు.

## ఆరోగ్య శాఖ చట్టాలపై నేడు సదస్సు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** వైద్య ఆరోగ్య శాఖ చట్టాలపై ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులకు ఈనెల 20న సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డా॥ బి. కళావతి బాయి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు కలెక్టరేట్‌లోని ప్రగతి మీటింగ్ హాల్‌లో జరిగే ఈ సదస్సుకు రిజిస్టర్ అయిన అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల ఎండిలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లు, క్లినిక్స్, డయాగ్నస్టిక్స్, ఇన్‌ఫెర్టిలిటి, నర్సింగ్ హోమ్ బాధ్యులు, రేడియాలజిస్టులు, గైనకాలజిస్టులు హాజరు కావాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ చట్టాలపై కలెక్టర్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళావతి బాయి తెలిపారు. వివిధ చట్టాలకు సంబంధించి అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ సదస్సుకు పైన పేర్కొన్న బాధ్యులు తప్పక హాజరు కావాలన్నారు.

# పెండింగ్ భూ సమస్యలకు పరిష్కారం




-2వేల కొత్త రేషన్ కార్డుల జారీ

-3వేల మందికి రేషన్ కార్డుల్లో యాడింగ్

-338 కళ్యాణ కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

-సింగరేణి తహసీల్దార్ కార్యాలయంలో వేగంగా ఫైళ్ళ క్లియర్

-భూ భారతి ఫైల్స్ పరిష్కారంలో జిల్లాలో ఏడో స్థానంలో సింగరేణి తహసీల్దార్ కార్యాలయం

-రైల్వే, సీతారామ, హైవే భూసేకరణలోనూ భళా

ప్రజాపక్షం/కారేపల్లి: పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను అర్హులైన పేదలందరికీ అందే విధంగా సంక్షేమ ఫలాలు పేదలకు అందాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని నూటికి నూరుపాళ్ళు నెరవేర్చే విధంగా సింగరేణి తహసీల్దార్ కార్యాలయం పని చేస్తుంది. సంక్షేమ ఫలాలు పేద ప్రజల దరిచేరుతున్నాయ దానికి కార్యాలయం వెలువరించిన అధికారిక లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. వేలాది దరఖాస్తులు వచ్చినా విసుకు చెందకుండా రెవెన్యూ కార్యాలయ యంత్రాంగం సమన్వయంతో పని చేసి ప్రజల మెప్పు కూడా పొందుతోంది. పదేళ్ల తర్వాత చేపట్టిన రేషన్ కార్డుల జారీ ప్రక్రియతో తహసీల్దార్ కార్యాలయం మూడు నెలలుగా కిటకిటలాడుతోంది. వేలాదిగా అప్లికేషన్లు వచ్చినప్పటికీ ఇద్దరు రెవెన్యూ ఇన్స్పెక్టర్లు ఉండాల్సిన మండలంలో ఒక్కరే ఉన్నప్పటికీ అన్నింటినీ ఓపికతో పరిశీలించి ఏ ఒక్క అర్హుడు కూడా నాకు రేషన్ కార్డు రాలేదు అనే పదం వినపడకుండా అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేయడంలో సింగరేణి తహసీల్దార్ కార్యాలయం ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చింది. ఇప్పటి వరకు మండలంలో మూడు వేల కొత్త రేషన్ కార్డులు, మరో నాలుగు వేల మందిని రేషన్ కార్డుల్లో యాడింగ్ చేసే ప్రక్రియను ఆర్ఐ నరసింహారావు, తహసీల్దార్ రమేష్ నేతృత్వంలో ఆఫీస్ సిబ్బంది విజయవంతంగా పూర్తి చేశారు. ఉన్నతాధికారుల మన్ననలు కూడా పొందారు.

### భూ భారతి ఫైల్స్ క్లియరెన్స్‌లో జిల్లాలో ఏడో స్థానం...

రైతులకు ఎంతగానో ఉపయోగపడే విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టం భూ సమస్యల పరిష్కారంలో సింగరేణి మండలం జిల్లాలో ఏడో స్థానంలో నిలిచింది. ఎన్నో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను భూ భారతి చట్టం ద్వారా వచ్చిన దరఖాస్తులను పెండింగ్ పెట్టకుండా వేగంగా పరిశీలన జరిపి 200 భూ భారతి ఫైళ్లను తహసీల్దార్ కార్యాలయం క్లియర్ చేసింది. ఫైల్స్ క్లియరెన్స్‌లో ఆర్ఐ నరసింహారావు కీలకంగా వ్యవహరిస్తూ సీనియర్ అసిస్టెంట్, డిప్యూటీ తహసీల్దారు, జూనియర్ అసిస్టెంట్లను సమన్వయం చేసుకుంటూ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లు లేకుండా ప్రజలను ఏ మాత్రం తిప్పుకోకుండా ఇబ్బంది పెట్టకుండా చేసిన పనులు అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులను కూడా మెప్పించాయి.

### 338 కళ్యాణ లక్ష్మీ చెక్కులు...

ప్రజా ప్రభుత్వంలో 338 కళ్యాణ లక్ష్మీ చెక్కుల ఫైళ్లను వేగవంతంగా క్లియర్ చేసి వైరా ఎంఎల్ఏ మాళోత్ రాందాస్ నాయక్ చేతుల మీదుగా పంపిణీ చేయించారు. జిల్లా అధికారుల ఆదేశాలను పాటిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేస్తూనే అనేక పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన వారికి సమాధానం చెబుతూ వారి సమస్యలకు కూడా పరిష్కారం చూపే విధంగా సింగరేణి తహసీల్దార్ కార్యాలయం యంత్రాంగం పని చేసినదనడానికి ఎంఎల్ఏ రాందాస్ నాయక్ బహిరంగం వేదికల్లో ప్రశంసించిన తీరే ఉదాహరణ

### భూ సేకరణలోనే భళా...

మండలంలోని గాదెపాడు చర్లపల్లి రైల్వే క్రాసింగ్ స్టేషన్‌కు భూ సేకరణ, డోర్నకల్ కొత్తగూడెం డబ్లింగ్ లైన్‌లో కొత్త కమలాపురం, గేట్ కారేపల్లి, కారేపల్లి, కోమట్లగూడెం, మాణిక్యారం, రేలకాయలపల్లి గ్రామాలకు చెందిన 300 మంది రైతుల నుండి భూమిని సేకరించడంలో కూడా సింగరేణి తహసీల్దార్ కార్యాలయ యంత్రాంగం ఉన్నతాధికారుల ప్రశంసలు పొందింది. ఉసిరికాయలపల్లి రెవిన్యూ గ్రామాల్లో జాతీయ రహదారి భూ సేకరణ పనులతో పాటు రేలకాయలపల్లి, బాజీ మల్లయ్యగూడెం ప్రాంతంలోని 86 మంది రైతుల నుండి సీతారామ ప్రాజెక్టు కోసం భూ సేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేసి రైతులకు మేలు చేసే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం రద్దు

ప్రజాపక్షం/చంద్రుగొండ: ఈనెల 21న మండల పరిధిలోని బెండలపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రావాల్సి ఉండగా పర్యటన అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయబాబు అన్నారు. మంగళవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఉపరాష్ట్రపతి నామినేషన్ కారణంగా పర్యటన వాయిదా వేయడం జరిగిందన్నారు. త్వరలో పర్యటన వివరాలు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కోనేరు చిన్ని, తుళ్లూరి బ్రహ్మయ్య, రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు, భోజ్యా నాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, నల్లమోతు రమణ, ఫజల్ బక్ష, బొర్రా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రుల విభజన ప్రక్రియ పూర్తి



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరులోని ప్రాథమికోన్నత ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కల్లూరు ఆసుపత్రులు విభజన ప్రక్రియ మంగళవారం పూర్తయింది. ఈ మేరకు మందులు, ఫర్నిచర్లతో పాటు తదుపరి సామాగ్రి పంపిణీ ప్రక్రియ పూర్తయింది .కల్లూరు ప్రాథమికోన్నత ఆసుపత్రి, ఖాన్ ఖాన్ పేట లోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న పల్లెదవ ఖానా కు మార్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు వైద్యులు నవ్య కాంత్ తెలిపారు. జిల్లాలోని తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, వైరా, కల్లూరులలో ప్రాథమికోన్నత ఆరోగ్య కేంద్రం ప్రాంతీయ వైద్యశాల లో ఉన్న వైద్య సిబ్బంది విడివిడిగా సేవలందించాలని ఆదేశాలతో ఈ ప్రక్రియ పూర్తయినట్లు వైద్యులు తెలిపారు.

## ఆరోగ్య సేవలో ఆర్ఎంపిల పాత్ర మరవలేనిది



ప్రజాపక్షం/ బోనకల్ : ప్రజలందరికీ ఆరోగ్యాన్ని అందించడంలో ఆర్ఎంపిల పాత్ర మరువలేనిదని జిల్లా ఆర్ఎంపి సంఘం అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు అన్నారు. మండల పరిధిలోని రావినూతల గ్రామంలో మండల అధ్యక్షులు యంగల గౌతమ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలోని ఆర్ఎంపిలకు వైజ్ఞానిక శిక్షణ ఇచ్చి అధికారిక సర్టిఫికెట్లను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యం చేస్తున్న ఆర్ఎంపిలపై కేసులు బనాయించడం, అరెస్టు చేయడం అనేది ఈ సమస్యకు పరిష్కారం కాదన్నారు. వైద్య వృత్తికి దూరంగా ఉండకుండా ప్రాథమిక చికిత్స అందిస్తూ జాగ్రత్తలు పాటించాలని, సంఘ సభ్యులకు అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసు, జిల్లా సభ్యులు హసన్, జెడిమూర్తి, కాసీం, బోనకల్ మండల కార్యదర్శి బాలు, మండల సభ్యులు కర్లం,సుధాకర్, వివిధ మండలాల ఆర్ఎంపిలు పాల్గొన్నారు.

# పంటల ఉత్పత్తులపై కనీస మద్దతు ధర పెంపు

-నిర్దేశించిన మద్దతు ధరకు రైతులు పంటను విక్రయించాలి

-అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : భారత ప్రభుత్వం ఖరీఫ్ 2025 26 సీజన్‌కు పంట ఉత్పత్తులపై కనీస మద్దతు ధర పెంచడం జరిగిందని, నిర్దేశించిన మద్దతు ధరకు రైతులు తమ పంటను విక్రయించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. క్వింటాకు వరి కామన్ గ్రేడ్ రూ. 2369, గ్రేడ్ ఎ రూ. 2389, జొన్నలు హైబ్రిడ్ రూ. 3699, మాల్దండి రూ.3749, సజ్జలు రూ. 2775, రాగులు రూ.4886, మొక్కజొన్న రూ. 2400, కందులు రూ.8000, పెసర్లు రూ. 8768, మినుములు రూ. 7800, పల్లికాయ రూ. 7263, పొద్దుతిరుగుడు గింజలు రూ. 7721, సోయాబీన్ ఎల్లో రూ.5328, నువ్వులు రూ. 9486, నైజర్ సీడ్ రూ. 9537, పత్తి పొడుగాటి మధ్యరకం రూ. 8110, మధ్యరకం రూ. 7710, మద్దతు ధరగా నిర్ణయించడం జరిగిందని ఆయన తెలిపారు. మద్దతు ధర అంశాన్ని రైతులు గమనించి తమ పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

## వినాయక ప్రతిష్టాపనకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి



ప్రజాపక్షం/జూలూరుపాడు: వినాయక ప్రతిష్టాపనకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సబ్ ఇన్స్పెక్టర్ బి రవి అన్నారు. మంగళవారం జిల్లా ఎస్‌పి రోహిత్ రాజ్ ఆదేశాలతో జూలూరుపాడు సిఐ శ్రీలక్ష్మీ సూచనల మేరకు మండల ప్రజలకు కొన్ని సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు గణపతి నవరాత్రుల సందర్భంగా తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలను సూచించారు. గణేష్ మండపాల వద్ద అధిక శబ్దం చేసే డీజేలకు అనుమతి లేదని, పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మొదటిగా విద్యుత్ శాఖ నుండి పర్మిషన్ తీసుకోవాలని, గణేష్ కమిటీ సభ్యులు మండపాల దగ్గర ఎటువంటి గొడవలు జరగకుండా చేసుకోవాల్సిన బాధ్యత కమిటీ వారిదే అని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేయాలని తెలిపారు.

# యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం విఫలం




- చేతగాని బిజెపి కేంద్ర మంత్రులు, ఎంపీలు

- అందించకుంటే పోరాటం తప్పదు

౦ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం

ప్రజాపక్షం/పాల్వంచ : రాష్ట్రానికి 9.80 లక్షల యూరియా కేటాయిస్తే ఇప్పటి వరకు 5.32 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చిందని యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలం అయ్యిందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ( ఏఐకేఎస్ ) జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం ఆరోపించారు. స్థానిక చండ్రా రాజేశ్వరరావు భవన్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుండి ఇద్దరు కేంద్ర మంత్రులతో పాటు ఆరుగురు ఎంపిలు ఉండి కూడా రాష్ట్ర రైతులకు ఒనగూరింది ఏమీలేదన్నారు. రైతులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నా ఏమీ చేయలేకపోతున్నారని విమర్శించారు. మతం, కులం పేరుతో ప్రజలను రెచ్చగొట్టడం తప్ప కేంద్ర మంత్రులు, ఎంపిలు ఏమి సాధించలేరన్నారు.కేంద్ర మంత్రులైన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు దమ్ముంటే రాష్ట్ర రైతుల సంక్షేమం కోసం రాష్ట్రానికి రావలసిన యూరియా కోసం ప్రధానమంత్రిని నిలదీయాలని, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. కానీ రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల సంక్షేమం పట్టని ఎనిమిది మంది బిజెపి ఎంపీలు నోరుమూసుకొని ఉన్నారని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్షకు తావులేకుండా తక్షణమే రాష్ట్రానికి రావాల్సిన యూరియాను సరఫరా చేయాలన్నారు. లేని యెడల రైతులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, రైతు సంఘం నాయకులు బివి. సత్య నారాయణ, రాము, జకరయ్య, రామాచారి, శ్రీను, వెంకటేశ్వర్లు, కొంగర అప్పారావు, బానోత్ రంజిత్, సర్వయ్య, అల్లి వెంకటేశ్వర్లు, క్రిష్ణ, సత్యనారాయణ, పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ డే



ప్రజాపక్షం/ములకలపల్లి: ప్రపంచ ఫోటోగ్రఫీ డే వేడుకలను మండల కేంద్రంలోని అఖిల్ స్టూడియో నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులుగా పాయం నరసింహారావు, కార్యదర్శిగా కసబోయిన సతీష్, కోశాధికారిగా శ్రీరాముల, జగదీశ్వరచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మండల అధ్యక్షులు కేక్ కట్ చేశారు. ఈకార్యక్రమంలో రవీంద్ర చారి, రాము, సత్తిబాబు, శేఖర్, ప్రేమ్, అరుణ్, అర్జున్, రవి, విజయేంద్రప్రసాద్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిఐటియు ఆధ్వర్యంలో సుబ్లేడు ప్రాథమిక కేంద్రం వైద్యురాలు డాక్టర్ వసుంధరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం అందించారు. ఈసందర్భంగాధ సిఐటియు మండల కన్వీనర్ వశపంగు వీరన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఆశా వర్కర్లకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానం అమలు చేయలేదని అన్నారు. ఆశాల సమస్యల పరిష్కారానికై ఆగస్టు 25న చలో కలెక్టరేట్, సెప్టెంబర్ 1న చలో హైదరాబాద్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు, ఈ కార్యక్రమాలను ఆశాలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు మోటమర్రి నాగేంద్ర, కూరపాటి లత, తిమ్మిడి సైదమ్మ, అరుణ, దోమల సత్యవతి, లక్ష్మీ, లీల, పూలమ్మ, స్వాతి, పుష్పలత, సుకన్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది సిపిఐ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రజా సమస్యలు పై నిరంతరం పోరాడేది భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చెరువు మాధరం గ్రామానికి చెందిన కట్టేబోయిన కాశయ్య నివాసం వద్ద పాలకుర్తి తిరపతిరావు అధ్యక్షతన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి బానుప్రసాద్, మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వారరావు వివిధ పార్టీలకు చెందిన 15మందిని పార్టీ కండువా కప్పి సిపిఐ పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని తెలిపారు. వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్లు, లిస్ట్ లతో సంబంధం లేకుండా అధికారులు నిజమైనా అర్హులకు ఇవ్వాలని అన్నారు. అధికార పార్టీతో ఉన్న స్నేహ ధర్మాన్ని పాటిస్తూనే ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో మండలం సహయ కార్యదర్శి మాలోతు ఆయోధ్య, సిపిఐ సీనియర్ నాయకులు భాగం నరసింహారావు, కార్యవర్గ సభ్యులు రాయల మాధవ్ రావు గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

## మణుగూరులో ఘనంగా ఫోటోగ్రఫీ దినోత్సవం



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రముఖ పారిశ్రామిక ప్రాంతమైన మణుగూరు పట్టణంలో మంగళవారం మణుగూరు ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 186వ ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫోటో గ్రఫీ పితామహులు లూయిస్ డాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచ వ్యాప్తంగా ఫోటోగ్రఫీ యొక్క సాంకేతిక పరిజ్ఞానాన్ని సుమారు రెండు వందల ఏళ్ల క్రితమే తెలుసుకుని ఫోటోగ్రఫీ ప్రాముఖ్యతను, విలువలను తెలియజేసిన ఘనత ఆయనదని, అలాంటి గొప్ప వ్యక్తి ఫోటోగ్రఫీ ని ప్రపంచానికి పూర్తిగా తెలియజేసిన సందర్భంగా ప్రతీ ఏటా ఇదే రోజున ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు మణుగూరు మండల ఫోటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షులు వన్నం కృష్ణ మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు వందమంది ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

## పానీ పూరీ గో బ్యాక్ కొత్త ఉద్యమ సంస్థ ఆవిర్భావ సభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/మణుగూరు:** ఈ నెల 20 తేదీన బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు రాజధాని నడిబొడ్డున బషీరాబాగ్ ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యమ నాయకుడు, మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డా. పిడమర్తి రవి నాయకత్వంలో పానీ పూరీ గో బ్యాక్ అనే నినాదంతో రాష్ట్రంలో మరో తెలంగాణ అస్తిత్వ ఉద్యమ ఆవిర్భావ సభ జరుగుతుందని మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిద్దెల తిరుమలరావు తెలిపారు. బతుకు దెరువుకోసం తెలంగాణ కు వచ్చి ఆర్థిక పరిపుష్టి సాధించి, బరితెగించి దాడులకు దిగుతున్న ఉత్తరాది మార్వాడీల పెత్తనాన్ని ప్రశ్నిస్తూ, జరుగుతున్న ఈ సభకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న తెలంగాణ వర్తక సంఘం, స్థానిక వ్యాపారులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఆశావర్కర్ల పారితోషికం విడుదల చేయాలి



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** ఆశ వర్కర్ల జులై నెల ఇన్సెంటివ్ విడుదల చేయాలని సిఐటియు జిల్లా నాయకులు లిక్కి బాల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జులై నెల పెండింగ్ ఇన్సెంటివ్ విడుదల చేయాలని స్థానిక ప్రభుత్వ హాస్పిటల్లో గల పిపి యూనిట్ ముందు ఆశ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ రిషిత కు వినతి పత్రం అందించారు. సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ. రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు నేటికి జూలై నెల పారితోషికాలు రాలేదనీఅన్నారు. పారితోషికాలు రాకపోవడంతో ఆశా వర్కర్లు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆశా వర్కర్ల పారితోషికాలను ప్రతి నెల 30వ తేదీలోపు చెల్లించేవారనీ చెప్పారు. ఈ ప్రభుత్వం లో ఆశా వర్కర్లకు పారితోషికాలు గతంలో చెల్లించినట్లు సకాలంలో రావడం లేదనీ ఆరోపించారు. జూలై నెల పారితోషికాలు వెంటనే చెల్లించాలని,ఆగస్టు నెల పారితోషికాలు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు ఫిక్స్డ్ వేతనం పద్దెనిమిది వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మె సందర్భంగా ప్రభుత్వం పెంచిన పదిహేను వందల ఇన్సెంటివ్ కలిపి జూలై నెల పారితోషికం వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ టౌన్ అధ్యక్షురాలు గంగ, లత, దేవి, సుశీల, లలిత ప్రశాంతి, భాగ్య, శిరీష, నాగమణి ప్రమీల, శారద, సుజాత, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**- రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి**
**- తల్లంపాడులోని నరసిహపురంలో పంటల పరిశీలన**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండలం తల్లంపాడులోని నర్సింహాపురంగ్రామంలో నీట మునిగిన రైతుల పంట పొలాలను సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఖమ్మంరూరల్ మండలం వ్యాప్తంగా తుఫానుతో నల్లరేగడి నేలలు ఊట పెట్టినట్లుగా తెలిపారు. దీంతో రైతులు సాగు చేసిన పెసర, మొక్కజొన్న, పత్తి, మిరప పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఎకరానికి రూ.50వేలు పెట్టుబడి పెట్టి తుఫాన్‌తో రైతులు నష్టపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు తీవ్ర స్థాయిలో కురుసే అవకాశం ఉన్నందున వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు అధికారులతో క్షేత్రస్థాయిలో పంట నష్టంను అంచన వేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఏలూరి భాస్కర్‌రావు, నాయకులు బానోత్ రాంకోటి, పాల్తీయా శ్రీను, సిద్ధంశెట్టి ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థపై దృష్టి సారించాలి

**ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య**



**ప్రజాపక్షం/ఇల్లందు:** అల్పపీడిన ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థ పై దృష్టిసారించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్ష ప్రభావం వలన గ్రామాల్లో దెబ్బతిన్న అంతర్గత రోడ్లను, బీటీ రోడ్లను గుర్తించి వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు. వర్షాల కారణంగా చెరువులు, కుంటలు పొంగి పొర్లుతున్నాయని చిన్నపిల్లలను అటువైపు వెళ్ళకుండా చూడాలన్నారు. విద్యుత్ ఉత్పత్తి నిర్విరామంగా కొనసాగాలని ప్రజలని ఇబ్బంది పెట్టకూడదన్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రభుత్వ డాక్టర్లు నర్సులు ఏఎన్ఎంలు అందరూ అందుబాటులో ఉండాలని ప్రజలను చైతన్య పరచాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడ మందులు నిల్వ ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలలో, పురాతన కాలపు ఇళ్లలో నివసించే వారికి గుర్తించాలని, దోమల బెడద కలిగే అవకాశం ఉన్నందున నిల్వ నీరు లేకుండా చూడాలని బ్లీచింగ్ దోమల, స్ప్రేయింగ్ జరిపించాలని కోరారు. మండలంలో ఉన్న ప్రభుత్వ హాస్టల్లో పరిశుభ్రత పాటించాలని, పిల్లలకు సక్రమంగా మెనూ అందించాలని, తప్పు జరిగితే ఉపేక్షించే అవకాశం ఉండదని తెలిపారు. ఈ సమావేశంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భానోత్ రాంబాబు, ఎంపీడీవో ధన్ సింగ్, డీఎస్పీ చంద్రబాను, అగ్రికల్చర్ ఏవో సతీష్, కొమరారం పి హెచ్ సి డాక్టర్ లోహిత, ఆర్ఐ కామేశ్వరరావు, ఏ ఈ బాలాజీ, హర్షిని, సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నేరుగా విత్తే వరిసాగు లాభదాయకం..!



**ప్రజాపక్షం/పినపాక:** మండల పరిధిలోని ఉప్పాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం రైతులతో నేరుగా విత్తే వరి సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కెవికె ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీ భరత్ మాట్లాడుతూ ఉప్పాక గ్రామంలో సుమారు 300 ఎకరాల్లో నేరుగా విత్తే వరి సాగు జరుగుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. రైతులను అభినందిస్తూ, ఈ పద్ధతి ద్వారా రైతులకు అనేక లాభాలు కలుగుతాయని వివరించారు. నాటు వేయడం కంటే నేరుగా విత్తడం వల్ల కూలీ ఖర్చు తగ్గుతుందని, ఎకరానికి సుమారుగా రూ 5000 వరకు పెట్టుబడి ఆదా అవుతుందన్నారు. కలుపు నివారణను జాగ్రత్తగా చేపడితే పెట్టుబడి భారం తగ్గుతుందని, అలాగే ఈ విధానంలో నీటి అవసరం కూడా తక్కువగా ఉంటుందని, వరి పంటలో అజోల్లా జల్లుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు కూడా రైతులకు వివరించారు. అజోల్లా నత్రజని ని నేరుగా పంటకు అందించడం వల్ల యూరియా వినియోగాన్ని తగ్గించుకోవచ్చు అని కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బి. తాతారావు, పినపాక ఎంఏఓ వెంకటేశ్వర్లు, హార్టికల్చర్ అధికారి శివ, ఎక్స్టెన్షన్ శాఖ నుండి హరిశ్చంద్ర, ఏఈఓలు కె. రమేష్, ఎస్. నాగేశ్వరరావు లు పాల్గొన్నారు. గ్రామ రైతులు, పెద్దలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు బి. తాతారావు మాట్లాడుతూ భవిష్యత్తులో ఉప్పాక గ్రామం భద్రాద్రి జిల్లా మొత్తానికి ఆదర్శంగా నిలవాలని ఆశిస్తున్నానని తెలిపారు.

# ఘనంగా 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు




**ప్రజాపక్షం/కరకగూడెం/పినపాక:** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పినపాక, కరకగూడెం మండలాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పినపాక, కరకగూడెం మండలాలలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు సిరిశెట్టి కమలాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కీసర సుధాకర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సారయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కరకగూడెం మండలంలో ఫోటో గ్రాఫర్ల ఐక్యతను చాటుతూ ఫోటో గ్రాఫర్ లు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కరకగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, గర్భిణీ స్త్రీలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కీసర సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఫోటోగ్రఫీ కేవలం కళ మాత్రమే కాకుండా సమాజాన్ని మలచగల శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. "ఒక ఫోటో వెయ్యి పదాలకు సమానం" అనే నానుడిని గుర్తుచేస్తూ, చరిత్రను సజీవంగా నిలుపడంలో ఫోటోగ్రఫీ అపారమైన పాత్ర పోషిస్తోందని అన్నారు. సమాజంలోని సమస్యలను వెలుగులోకి తేవడంలో, సాంస్కృతిక సంపదను తరతరాలకు అందించడంలో ఫోటోగ్రఫీ ప్రాధాన్యం ఎంతగానో ఉందని విశదీకరించారు. అదే విధంగా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు గుమ్మడి వెల్లి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వాగబోయిన సాంబశివరావు, కోశాధికారి, గాంధర్ల సతీష్, ఫోటోగ్రాఫర్ లు గుండు వెంకట నారాయణ, జిమ్మిడి ప్రకాష్, రంజిత్, సుధాకర్, విష్ణు, రాజేందర్, సాయి, వెంకట్,దిలీప్, మోహంత్, రెండు మండలాల ఫోటో గ్రాఫర్ లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమంగా మట్టి తోలకాలు..!

**- ట్రాక్టర్‌ను పట్టుకొన్న రెవెన్యూ అధికారులు**
**- అక్రమాలకు కేరాఫ్ రంగాపురం ?**



**ప్రజాపక్షం/పాల్వంచ :** అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్‌ను రెవిన్యూ అధికారులు పట్టుకొన్నారు. మండల పరిధి రంగాపురం గ్రామంలోని కిన్నెరసాని వాగు సమీపంలో గల మామిడి తోటలో జేసిబితో మట్టిని తవ్వుతూ పది ట్రాక్టర్లతో భారీ ఎత్తున పట్టపగలే మట్టి రవాణా చేస్తున్నారు. సమాచారం తెలుసుకొన్న గ్రామీణ ఆర్ఐ నలీన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్‌ను పట్టుకొన్నారు. అనంతరం మిగతా ట్రాక్టర్ల కోసం వేచి చూస్తుండగా మట్టి రవాణాకు పాల్పడుతున్న కొందరు వ్యక్తులు వచ్చారు. మా పట్టా భూమి నుండి మాత్రమే మా అవసరాలకు తోలుకొంటున్నాం . మీరెందుకు పట్టుకొంటారు అంటూ ఆర్ఐ చుట్టుముట్టారు. వెంటనే గ్రామీణ పోలీసులకు సమాచారం అందించారు. ఎట్టకేలకు ఓ ట్రాక్టర్‌ను పట్టుకొని తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. కాగా రంగాపురం అక్రమాలకు కేరాఫ్ అడ్డాగా మారుతోంది. కొందరు బడాబాబులు ఏకమయ్యారు. అక్రమాలకు తెరలేపారు. దొంగలు దొంగలు ఊర్లు పంచుకొన్న చందాన దందా కొనసాగిస్తున్నారు. రాత్రనకా, పగలనకా తమ డబ్బు పలుకుబడితో ఒకవైపు మట్టి, మరోవైపు ఇసుక రవాణా చేస్తూ అధికారులకు సవాల్ విసురుతున్నారు. అడ్డొచ్చిన అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నాగారం గ్రామం నుండి గత కొన్ని నెలల క్రితం రాత్రి సమయంలో ఇసుక రవాణా చేస్తున్న ఓ వాహనాన్ని అటవీ అధికారులు పట్టుకొన్నారు. దీనితో కోపోద్రిక్తులైన వాహన సంభందీకులు అటవీ అధికారిపై దాడికి పాల్పడి ట్రాక్టర్‌ను తీసుకొని పోయారని దీనితో సంభందిత అధికారులు ఫిర్యాదు మేరకు డ్రైవర్, ఓనర్లపై కేసు నమోదు చేశారని తెలుస్తోంది. ఇలా అక్రమాలకు తెగబడుతున్న మాఫియా అధికారులపై దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తూ తమ అక్రమ పర్వానికి అడ్డుతొలగించుకొంటున్నారని పలువురు అంటున్నారు. అధికారులు ఉపేక్షిస్తే మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉందని కావునా అనుమతులు లేకుండా అక్రమాలకు పాల్పడే మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు అంటున్నారు.

**- జరిమానా విధించాం...**

ఈ విషయంపై తహశీల్దార్ దారా ప్రసాద్ వివరణ కోరగా సంఘటనా స్థలానికి వెళ్ళిన ఆర్ఐ నలీన్ కుమార్‌పై వాదోపవాదాలకు దిగారన్నారు. దొరికిన ట్రాక్టర్‌ను తహశీల్దార్ కార్యాలయానికి తరలించామని అనంతరం జరిమానా విధించి పంపించి వేశామని తెలిపారు.

# రైతులకు యూరియా కష్టాలు తీరేదెన్నడో..!?

**సొసైటీ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు**



**ప్రజాపక్షం/కరకగూడెం:** మండలంలో ఖరీఫ్ సాగు ఉధృతంగా కొనసాగుతున్న వేళ యూరియా కొరత రైతులకు తలనొప్పిగా మారింది. మండలంలో రైతులు సొసైటీ ఆఫీసుల వద్ద తెల్లవారుజాము నుండే క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినా సరిపో యేంత యూరియా సరఫరా లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గుర వుతున్నారు. ఒక పక్క వరి నాట్లు పడుతున్న వేళ, పత్తి పూత పిందె దశకి చేరుకున్న వేళ సకాలంలో యూరియా వేసే అవసరం ఉన్నా, యూరియా ఎరువు అందకసాగు నిలిచిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ఉదయం 7 గంటలకి వస్తే, మధ్యాహ్నం అయినా ఒక బస్తా చేతికి రావటం కష్టమైపోతుందని రైతులు వాపోతున్నారు. వానలో కాపలిగా ఉన్న రైతులు ఎదరుచూసినట్లు యూరియా కోసం రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని, ఎరువుల సరఫరాలో పారదర్శకత, సకాలంలో అందుబాటులో ఎరువులు తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక పక్క ప్రైవేట్ దుకాణాలలో యూరియా దొరక్కపోవడంతో రైతులు చేసేదేమీ లేక సహకార పరపతి సంఘాలకు పరుగులు పెడుతున్నారు. మండలం మొత్తంలో ఒక్క సహకార పరపతి లోనే యూరియా లభించడంతో చేసేదేమీ లేక రైతులు వ్యవసాయ పనులు వదిలేసి యూరియా కోసం క్యూలైన్లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం 7 గంటలకు వచ్చిన రైతులు యూరియా దొరక్కా రెండో రోజు కూడా క్యూలైన్లో నిలబడితే తప్ప దొరకని పరిస్థితి కరకగూడెం మండలంలో నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యూరియా నిల్వలను ఉండేలా కొరత లేకుండా చూడాలని రైతులు వాపోతున్నారు. ఈ మధ్యకాలంలో జిల్లా కలెక్టర్ యూరియా కొరత ఎక్కడా లేదని చెప్పారు కానీ యూరియా కొరత కరకగూడెం మండలంలో విపరీతంగా ఉందని తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులను యూరియా కొరత నుండి కాపాడాలని రైతులు వేడుకొంటున్నారు.

# ఎరువులు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు కావస్తున్న నేటికీ రైతులకు సరిపడా ఎరువులు అందించుటలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పిఎసిఎస్ డైరెక్టర్, టిడిపి పార్టీ కన్వీనర్ బొంతు శ్రీనివాసరావు విమర్శించారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరియా కొరతతో కొనుగోలు కేంద్రాల వద్ద క్యూ లైన్ లలో పడిగాపులు కాస్తున్నారన్నారు. గంటల తరబడి నిలబడలేక చెప్పులు, సెల్ ఫోన్లు, ఆధార్ కార్డు, పాస్ బుక్ జిరాక్స్ లు క్యూ లైన్ లోపెట్టి వేచి చూడవలసిన పరిస్థితి ఏర్పండిందని దీనికి రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమన్నారు. ఒక్కొక్క కొనుగోలు కేంద్రం వద్ద ఆరు వందల మందికి పైగా రైతులు గంటల తరబడి పడిగాపులు కాసినా పట్టు మనీ 200 బస్తాలు కూడా దొరకటం లేదన్నారు. ఆ అర కొర బస్తాల కోసం ఒక్కసారిగా రైతులు గుమ్మి గూడటంతో తొక్కి సలాటలు జరిగి అన్నదాతలు అస్వస్థకు గురై, దవాఖానాల పాలవుతున్నారని మండిపడ్డారు. వారం పది రోజులకు ఒక్కో రైతుకు కేవలం ఒకటి లేదా రెండు యూరియా బస్తాలు మాత్రమే ఇస్తామని అధికారులు చెప్తున్నారని,ఆచరణలో మాత్రం ఒక్కొక్క రైతుకు ఒక బస్తా యూరియా కూడా ఇవ్వటంలేదన్నారు. రైతులకు సరిపడా ఎరువులు అందక పోవటంతో రైతన్నల దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి రైతులకు సరిపడా ఎరువులు అందించాలని, జోనల్ వైజ్ గా పంటల బీమా అమలు చేయాలని, వ్యవసాయ కళాశాల క్షేత్రంలో సంకరజాతి, నూతన వంగడాలు ఉత్పత్తి చేయాలని, నకిలీ పురుగు మందులు, విత్తనాలు అరికట్టి దళారీ వ్యవస్థను నిలువరించాలనీ, సకాలంలో రైతులకు సరిపడా ఎరువులు పంపిణీ చేసి అన్నదాతను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 22న చలో ప్రజాభవన్




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న తలపెట్టిన చలో ప్రజాభవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రగతి శీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కొత్తగూడెం రీజియన్ అధ్యక్షులు అమర్ల పూడి శరత్ పిలుపునిచ్చారు. మంగళవారం నిర్వహించిన సింగరేణి కార్మికుల గ్రూప్ మీటింగ్ లో ఆయన మాట్లాడుతూ 20 నెలలు కావస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపద్యంలో 22న చలో ప్రజా భవన్ కార్యక్రమం తలపెట్టినట్లుగా పేర్కొన్నారు.

## సరోజిని వృద్ధాశ్రమంలో అన్నదానం



**ప్రజాపక్షం/భద్రాచలం :** స్థానిక సరోజిని వృద్ధాశ్రమంలో చేతన మీ సేవా నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. చేతన మీసేవా రంజిత్ కుమార్తె జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యాతిధులుగా విచ్చేసిన జాతీయ ఫొటో గ్రాఫర్ షరీప్, కొప్పుల మురళీ, జిందా ముఖ్యాతిధులుగా హాజరై అన్నదానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మదినం జరుపుకుంటున్న చేతన భవిష్యత్‌లో బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అదిరోహించాలని ఆకాంక్షించారు. అదే విధంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు ధారావత్ భాస్కర్, ఆశ దంపతుల కుమారుడు జెస్సిక్ కార్తికేయ జన్మ దినాన్ని కూడా సరోజిన వృద్ధాశ్రమంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు మాన్‌సింగ్, ఆశ, తదితరులు పాల్గొన్నారు.

## పారితోషికం వద్దు.. కనీస వేతనం ఇవ్వాలి



**ప్రజాపక్షం/గుండాల :** స్థానిక పిహెచ్‌సిలో పనిచేస్తున్న ఆశవర్కర్లు పారితోషికం వద్దని ఫిక్సుడు వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వైద్య కేంద్రం ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వైద్యాధి కారికి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. సంఘ జిల్లా కమిటి సభ్యురాలు వజ్జ సుశీల మాట్లాడుతూ , తమకు నెల నెల సక్రమంగా వేతనం చెల్లిస్తామని హామి ఇచ్చిన ప్రభుత్వం నేటికి ఇరవై రోజులు గడుస్తున్న వేతన చెల్లింపులో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 25న జిల్లా కలెక్టరేట ముందు , 30న హైద్రాబాద్ కమిషనరేట్ కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహించనున్నట్లు ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జబ్బ ఆదిలక్ష్మి , పూనెం సరోజ, ఊకె విజయ లక్ష్మి , లక్ష్మి నరసమ్మ, వసంత, వినోద, ఈశ్వరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఎంపీడీఓ యర్రయ్యకు ఘనసన్మానం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక ఎంపిడిఓ యం.యర్రయ్య జిల్లా ఉత్తమ ఎంపీడీఓ అధికారిగా అందుకున్న సందర్భంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయం లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడారు. మండలం ను అన్ని రంగాలలో ఆదర్శంగా పాలన సాగించేలా చెర్యలు తీసుకొవటం చాలా సంతోషం గా ఉందని అన్నారు. ఇలాంటి అవార్డు లు మరెన్నో అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సాక్షి రిపోర్టర్ పెంటామళ్ల కోటయ్య, సూర్య పేపర్ రిపోర్టర్ వడ్లమూడి వేంకటేషశ్వర రావు, ప్రజాపక్షం దినపత్రిక రిపోర్టర్ మల్లెబోయిన ఉపేందర్ పాల్గొన్నారు.

## నేడు సింగరేణి ఓసీల పర్యావరణంపై ప్రజా అభిప్రాయ సేకరణ సభ



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసి విస్తరణలో భాగంగా మూడు గ్రామాలలోని 813 ఎకరాల భూ సేకరణ చేసి విస్తరణకు అధికారులు ప్రభుత్వ యంత్రాంగం ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఇందుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల కోసం ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల ప్రజలతో ప్రజా అభిప్రాయ సేకరణ కోసం నేడు సింగరేణి గ్రౌండ్ లో భారీ సభను సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేయనున్నది. ఈ ఏర్పాట్ల కోసం సింగరేణి జిఎం రామ్ చందర్ మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, పవిత్ర యంత్రాంగం సభ నిర్వహించడానికి ఏర్పాటు చేసిన ప్రాంతంలో వారు పర్యటించి స్థలాన్ని పరిశీలించారు.

## గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి



**ప్రజాపక్షం/ఇల్లందు:** వినాయక చవితి సందర్భంగా ఇల్లందు పట్టణంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఇల్లందు డిఎస్పి చంద్రబాను అన్నారు. మంగళవారం ఇల్లందు పోలీస్ స్టేషన్లో నిర్వహించిన గణేష్ ఉత్సవ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు పెట్టేవారు పోలీస్ స్టేషన్లో కచ్చితంగా పర్మిషన్ తీసుకోవాలన్నారు. మండపాల వద్ద డీజె లు పెట్టకూడదని సూచించారు. రాత్రి వేళ్లలో గుంపులుగా ఉండి ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. విద్యుత్ వైర్ల కింద మండపాలు విగ్రహాలను పెట్టకూడదన్నారు. విద్యుత్, అగ్నిమాపక శాఖ అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్సై హాసీనా, సూర్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.